క్లుప్తంగా

పింఛన్లు పునరుద్ధరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ఉంగుటూరు: తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని దివ్యాంగులు కోరారు. సోమవారం ఉంగుటూరు తహసీల్దార్‌కు దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెరిఫికేషన్‌లో భాగంగా పింఛన్లు తొలగించి నోటీసులు జారీ చేసి అనర్హులుగా చేయడం దారుణమన్నారు. సదరం ధృవపత్రంలో శాతాన్ని తగ్గించి ఉద్యోగ అవకాశాలు కోల్పోయేలా చేయడం, కొంత మందికే పింఛన్లు పరిమితం చేయడం వలన దివ్యాంగులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున తొలగించిన పింఛన్లను పునరుద్ధరించి, ఉపాధి అవకాశాలు కల్పించి, 2016 చట్ట ప్రకారం అన్ని రకాల వసతులు కల్పించాలని కోరారు.

అసెస్‌మెంట్ పుస్తకాల తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో నర్సింహమూర్తి

పెదపాడు: విద్యార్థుల పఠనాసక్తిని మెరుగుపరచాలని పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి ఉపాధ్యాయులకు సూచించారు. పెదపాడు మండలంలోని వట్లూరు నెహ్రూనగర్ కాలనీలోని బేసిక్ ఫౌండేషన్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ పరీక్షా అసెస్‌మెంట్ పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ పురస్కారం



కొవ్వలి ఉన్నత పాఠశాల

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాల ప్లస్‌కు ప్రభుత్వం స్పోర్ట్స్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం సమాచారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి పంపారు. 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడల్లో కొవ్వలి ఉన్నత పాఠశాల సాధించిన ప్రగతికి గాను ఏలూరులో జరిగే పురస్కారాల ప్రదానోత్సవంలో కొవ్వలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యాయామ ఉపాధ్యాయునికి పురస్కారాన్ని అందజేస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి వివరించారు. ఈ మేరకు కొవ్వలి సర్పంచ్ ఇంటి మధులత, ప్రధానోపాధ్యాయుడు శర్మ, ఉపాధ్యాయుడు సురేష్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



ప్లేట్లను అందిస్తున్న సర్పంచ్, దాత

గణపవరం: పూర్ణిమ మెమోరియల్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వాహకుడు, రిటైర్డ్ ఉద్యోగి తులా ఆదినారాయణ ఆధ్వర్యంలో జల్లికొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 180మంది విద్యార్థినీ విద్యార్థులకు భోజనం ప్లేట్లను సోమవారం పంపిణీ చేశారు. వీటి విలువ రూ.20 వేలు ఉంటుంది. స్థానిక సర్పంచ్ కె.వెంకటరత్నం, దాత ఆదినారాయణ చేతులమీదుగా ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. ట్రస్టు సేవలను ఈ సందర్భంగా సర్పంచ్ అభినందించారు. ఎంపీటీసీ బుద్దాల వెంకటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సభ్యులు

పెదపాడు: మండలంలోని వసంతవాడలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సమాజంలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవత సభ్యులు కోరారు. పెదపాడు మండల శాఖ కోశాధికారి ఇంజమాల బాలశౌరి, ఉమామహేశ్వరరావు ప్రధానోపాధ్యాయులు కె.శ్రీరామ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

- పాఠశాలల నిర్వహణ నిధులకు మంగళం
- గత ఏడాది 100 శాతం స్కూల్ గ్రాంట్ ప్రతిపాదనలు
- అప్పట్లో 50 శాతం నిధులు మాత్రమే పాఠశాల ఖాతాలకు
- నియోజకవర్గంలో 195 స్కూళ్లకు రూ.27.62 లక్షల నిధులు
- ఈ నిధుల పర్యవేక్షణకు పీఎంశ్రీ పేరుతో మరో యాప్





జల్లికొమ్మర జెడ్పీ స్కూల్లో ఫ్లోరింగ్ రిపేర్ చేస్తున్న సిబ్బంది, నిధుల వినియోగం పర్యవేక్షణకు రూపొందించిన పీఎంశ్రీ యాప్

నిడమర్రు: కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కల్పన, స్వచ్ఛ కార్యక్రమాల అమలు, అవసరమైన సామగ్రి కొనుగోలు నిమిత్తం ప్రభుత్వం స్కూల్ వార్షిక గ్రాంట్ ఇస్తుంది. ఈ గ్రాంట్ కోసం ఉంగుటూరు నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు గత ఏడాది (2024–25) 100 శాతం ప్రతిపాదనలు పంపగా 50 శాతం నిధులను ఆయా స్కూళ్ల సీఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లోకి అధికారులు జమ చేశారు. మిగిలిన 50 శాతం నిధులను విద్యా సంవత్సరం పూర్తయినా అధికారులు మంజూరు చేయలేదు. స్కూల్ స్థాయిలో సిద్ధం చేసిన ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లోనే మండలం, జిల్లా, స్టేట్ లెవెల్లో ఆమోదించాల్సి ఉంది. దీంతో ఆ విద్యా సంవత్సరంలో ఖర్చు చేసిన బిల్లులకు సంబంధించిన మిగిలిన 50 శాతం నిధులను డ్రా చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల నిర్వహణ నిధులకు మంగళం పాడినట్లే అని పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్లు విమర్శిస్తున్నారు.

ప్రతిపాదిత నిధుల్లో 50 శాతం మాత్రమే మంజూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో 195 ప్రభుత్వ పాఠశాలలకు నిర్వహణ నిమిత్తం నవంబర్‌లో రూ.55.25 లక్షలకు గత ఏడాది హెచ్‌ఎంలు ప్రతిపాదనలు ఆన్‌లైన్ చేశారు. ఈ నిధుల్లో 50 శాతం రూ.27,62,500 నిధులను మాత్రమే మంజూరు చేశారు. ఆయా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పీఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లోకి సమగ్ర శిక్ష ద్వారా ఈ నిధులను జమ చేశారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకూ పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఖర్చులకు సంబంధిచిన బిల్లులను పీఎంశ్రీ యాప్‌లో అప్‌లోడ్ చేసి సీఎఫ్‌ఎంఎస్ ఖాతా నుంచి డ్రా చేసుకునే అవకాశం అధికారులు కల్పించారు. తాజాగా మిగిలిన రూ.27,62,500 నిధులను ఈ విద్యా సంవత్సరంలో ఖర్చు చేసుకునేలా మార్గదర్శకాలు అధికారుల నుంచి అందాయి.

2024–25 రోల్ ఆధారంగా కేటాయింపులు

ఈ నిధులను 2024–25 పాఠశాలల్లోని విద్యార్థుల నమోదు ఆధారంగా ప్రభుత్వం స్కూల్ గ్రాంట్ విడుదల చేసింది. రోల్ 1 నుంచి 30 వరకూ రూ.10 వేలు, రోల్ 31 నుంచి 100 వరకూ రూ.25 వేలు, 101 నుంచి 250 వరకూ రూ.50 వేలు, 251 నుంచి 1000 వరకూ రూ.75 వేలు, వెయ్యికి పైగా విద్యార్థులుంటే రూ.1 లక్ష నిధులను మంజూరు చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం కేటాయింపుల్లో 50 శాతం నిధులను మాత్రమే పాఠశాలల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటికే యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు నలిగిపోతుంటే ఈ గ్రాంట్ మంజూరు నుంచి వినియోగం ద్వారా అంతా పీఎంశ్రీ అనే మరో యాప్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంది.

స్కూల్ గ్రాంట్ వినియోగ మార్గదర్శకాలు

- మెగా పేరెంట్ మీటింగ్ నిర్వహణకు రూ.2,500.
- సుద్ద ముక్కలు, తెల్ల కాగితాలు, రిజిస్టర్లు మొదలైన వాటి కొనుగోలు, పరీక్షల నిర్వహణకు అవసరమైన స్టేషనరీ నిమిత్తం రూ.5 వేలు.
- గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ పండుగల నిమిత్తం రూ.2 వేలు.
- చిన్న చిన్న విద్యుత్ వైరింగ్, స్విచ్ బోర్డుల నిర్వహణ నిమిత్తం రూ.3,500.
- ఇంటర్నెట్ చార్జీల ఖర్చులకు రూ.2,500.
- జిరాక్స్, ప్రింటింగ్‌కు రూ.2 వేలు.
- డొక్కా సీతమ్మ బడి భోజన పథకంలో విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు అవసరమైన సబ్బులు, హ్యాండ్ వాష్, శానిటైజర్లు, ఫినాయిల్ వంటి వాటి కొనుగోలుకు రూ.2,500.
- తాగునీరు అందించే పైప్‌లైన్, ట్యాప్‌లు వంటి వాటి మరమ్మతులకు రూ.2500.
- పాఠశాల, టాయిలెట్ల పారిశుద్ధ్య నిర్వహణ కోసం రూ.2500.
- మిగిలిన నగదుతో తరగతి గదుల తలుపులు, కిటికీలు ఫ్లోరింగ్ మొదలైనవాటికి సంబంధించిన చిన్నచిన్న మరమ్మతులకు ఖర్చుచేసుకోవచ్చు.

2025 ఏప్రిల్ నుంచి నేటి వరకూ అవకాశం



రోల్‌ఆధారంగా విద్యాశాఖ ఉన్నత అధికారులు పాఠశాల నిర్వహణ నిధులను ఆయా స్కూల్స్ సీఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లో నేరుగా జమచేశారు. ఉన్నత అధికారుల మార్గదర్శకాల ద్వారా ఖర్చు చేయాల్సిఉంది. ఈ నిధులను 2026 మార్చిలోపు పాఠశాలకు అవసరమైన అంశాలను ఎస్ఎంసీ తీర్మానం చేసి వినియోగించుకోవచ్చు. ప్రతిబిల్లు ఆన్‌లైన్ తప్పనిసరిగా చేయాలి.

– యర్రంశెట్టి శేషగిరిరావు, ఎంఈవో–2, నిడమర్రు

మండలం	మొత్తం స్కూల్స్	మంజూరైన నిధులు
భీమడోలు	35	రూ.4,87,500
ఉంగుటూరు	65	రూ.9,47,500
నిడమర్రు	40	రూ.6,45,000
గణపవరం	55	రూ.6,82,500
మొత్తం	195	రూ.27,62,500

డీలర్లు ఇంటింటికీ రేషన్ అందించాలి

భీమడోలు: ఈ నెల 26వ తేదీ నుంచి వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులకు ఇంటింటికీ రేషన్ అందించాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలులో సోమవారం ఇంటింటికీ రేషన్ పంపిణీపై డీలర్లు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులకు ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎస్ డీటీ జి.భరత్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ 65 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, మంచం పట్టిన రోగులకు సెప్టెంబర్ రేషన్ సరుకులను ఈ నెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అందించాలన్నారు. అదే విధంగా సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాలను విధిగా తెరవాలని, ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటలకు రేషన్ సరుకులను అందించాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీలర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం గణపవరంలోని నిరుపేదలు, భిక్షగాళ్లు, వలస జీవులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ప్రతి వారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఆహారం పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్ తెలిపారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు కిలారి రవిబాబు, కె.సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి వెండి మకర తోరణం బహూకరణ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

భీమడోలు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన భీమడోలు శ్రీమన్మహా గణపతి ఆలయంలో స్వామి వారికి దాతలు సమకూర్చిన వెండి మకర తోరణానికి సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఇటీవల సుమారు రూ.10 లక్షల విలువ గల 9 కేజీల వెండితో స్వామి వారికి దాతలు, ఆలయ కమిటీ సంయుక్త సహకారంతో వెండి మకర తోరణాన్ని స్వామి వారికి బహూకరించారు. ఈ మకర తోరణానికి ఆలయ అర్చకులు, దాతలు, గ్రామ పెద్దలు భాగస్వామ్యంతో విశేష పూజలు చేసి సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మన్ దత్తాడ శ్రీనివాసరాజు మాట్లాడుతూ భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భీమడోలు శ్రీమన్మహా గణపతి స్వామి వారు భక్తుల పూజలు అందుకుంటున్నారన్నారు. ఈ నెల 27వ తేదీ బుధవారం నుంచి 61వ గణపతి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, దాతలు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనం



తహసీల్దార్ బి.రమాదేవికి సమస్యను వివరిస్తున్న రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి

భీమడోలు: ఎంపీటీసీలకు రావాల్సిన గౌరవ వేతనాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం భీమడోలు ఎంపీటీసీ–1, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేశారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.రమాదేవికి వినతిపత్రం అందించి ఎంపీటీసీలకు ఇవ్వాల్సిన 26 నెలల గౌరవ వేతన బకాయిలను వెంటనే మంజూరు చేయించాలని ఆయన కోరారు. తాము వైఎస్సార్ సీపీ హయంలో ఎంపీటీసీలుగా ఎన్నిక కాగా, నెలకు రూ.3 వేల చొప్పున వేతనం కొన్ని నెలల పాటు అందించారన్నారు. ఈ ప్రభుత్వం బకాయి పడిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపీటీసీలకు సరైన గుర్తింపు లేదని, న్యాయపరంగా రావాల్సిన వేతన బకాయిలను అందించడం లేదని ఆయన తహసీల్దార్ వద్ద వాపోయారు. గౌరవ వేతనంతో పాటు టీఏ, డీఏలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తహసీల్దార్ బి.రమాదేవి పేర్కొన్నారు. పలువురు సమస్యలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి సహకరించక.. ప్రభుత్వం పట్టించుకోక!

యూరియా కొరతతో రైతుల గగ్గోలు



యూరియా

దెందులూరు: సాగుకు ప్రకృతితో పాటు ప్రభుత్వ సహకారం అరకొరగా ఉండటం వలన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ యూరియా కొరత లేదని పంటలు పెట్టుబడి సాయం సకాలంలో అందిందని రైతులు చెబుతున్నారు. ఓ పక్క భారీ వర్షాలకు తీవ్ర ఆందోళన కలుగుతుందని మరో పక్క, యూరియా సరఫరా చేయలేకపోతే తాము ఏం చేయాలని సీతంపేట జోగన్నపాలెం సొసైటీ బ్రాంచీల పరిధిలోని గ్రామాల రైతులు వాపోతున్నారు. దెందులూరు మండలంలో 180 టన్నుల యూరియా సరఫరా చేయాల్సిఉంది. కానీ కేవలం 70 టన్నుల యూరియా మాత్రమే ప్రస్తుతం అమ్మకానికి సిద్ధంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పంటలకు పెట్టుబడి సాయం సకాలంలో రైతులకు అందేదని యూరియా కొరత ఎప్పుడు తాము చూడలేదన్నారు. ప్రకృతి కరుణించకా, ప్రభుత్వ సాయం అరకొర ఉంటే తాము ఎలా వ్యవసాయం చేసుకోవాలో అర్థం కావట్లేదని బాధిత రైతులు అంటున్నారు.

24 గంటల్లో యూరియాను రప్పిస్తాం

దెందులూరు మండలంలో 108 టన్నులు యూరియా రావాల్సి ఉండగా ప్రస్తుతం 70 టన్నుల యూరియా మాత్రమే సోమవారం నాటికి ఉంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 24 గంటల్లో డిమాండ్ మేరకు యూరియాను దెందులూరు మండలానికి అందిస్తాం.

– ఎల్.శ్రీనివాసరాజు, మండల వ్యవసాయ అధికారి

విభిన్న ప్రతిభావంతులపై కూటమి కక్ష



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితుడు తాతా మాణిక్యాలరావు

పెదవేగి: నిబంధనలకు విరుద్ధంగా పలుమార్లు తనపై వికలాంగ పరీక్షలు చేసి అర్హత ఉందని ధ్రువీకరించినా పింఛన్ ఆపుతామని వేధిస్తున్నారంటూ ఓ విభిన్న ప్రతిభావంతుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండలంలోని పెదవేగి గ్రామానికి చెందిన బాధితుడు తాతా మాణిక్యాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వికలాంగ పింఛన్ అర్హత ఉన్నా తనకు పింఛన్ నిలిపి వేశారని ఫిర్యాదు చేయగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ జడ్జి ముందు హాజరయ్యారన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో వికలాంగ పరీక్షలో మాణిక్యాలరావు అర్హత సాధించారని, పింఛన్ ఇస్తామని కేసు క్లోజ్ చేయించుకున్నారని, ఇప్పుడు మళ్లీ టెస్ట్ చేయించుకోవాలని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెస్ట్ చేసి పింఛన్ ఇస్తున్న పెదవేగి వెల్ఫేర్ అసిస్టెంట్, ఎంపీడీఓ రాజకీయ కారణాలతో మరలా టెస్టుకు వెళ్లమని మని వేధిస్తున్నారని వెళ్లక పోతే పింఛన్ ఆగిపోతుందని బెదిరిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యాడు. దీంతో చేసేదేమి లేక కూటమి ప్రభుత్వంలో ఎన్ని సార్లు టెస్ట్‌కు వెళ్లాలని ఏలూరు కలెక్టరేట్‌లో 3వ సారి పీజీఆర్ఎస్‌లో మాణిక్యాలరావు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికైనా నాపై వేధింపులు ఆపి గతంలో మాదిరిగా పింఛన్‌ను కొనసాగించాలని వేడుకుంటున్నాడు.

గణపవరాన్ని ఏలూరులో కలపొద్దు



గణపవరాన్ని ఏలూరులో కలపొద్దని ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

గణపవరం: మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపాలన్న నిర్ణయాన్ని ఏ మాత్రం సహించబోమని, ఈ మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే కొనసాగించాలని గణపవరం మండల అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గణపవరం నుంచి అఖిలపక్ష నాయకులు సోమవారం ఏలూరు వెళ్లి జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకుడు పాతపాటి హరికుమార్ రాజు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాకు సరిహద్దులోనూ, జిల్లా కేంద్రం భీమవరానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో కలపాలన్న డిమాండ్ మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించి, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లాలోకి వచ్చిందన్నారు. దీంతో గణపవరం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ పనులకు భీమవరం వెళ్లడం చాలా సులభమైందన్నారు. దీనిని ఏలూరు జిల్లాలో కలపాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయని మండల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ఏలూరు జిల్లాకు గణపవరం మండల గ్రామాలు 100 కిలో మీటర్ల దూరంలో ఉంటాయన్నారు. ఏలూరు వెళ్లాలంటే కనీసం మూడు బస్‌లు మారి, ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నంద్యాల రామలింగరాజు, ఇందుకూరి రామకృష్ణం రాజు, కూనిరెడ్డి సోమేశ్వరరావు, ఐఎస్‌రాజు, యాళ్లసుబ్బారావు, ఎం.పెంటారావు, కూసంపూడి సురేంద్ర, ముత్యాల వేణు,కె.జగపతి రాజు, జూపల్లి రాజేంద్ర, కవల రాంబాబు, పల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

ఉంగుటూరు: గొల్లగూడెం సబ్ స్టేషన్ వద్ద ఆయిల్‌పామ్ కార్మికులకు, రైతులకు సోమవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ గెల కోత కార్మికులకు ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అలాగే ఆయిల్‌పామ్ రైతులకు కరెంట్ యాక్సిడెంట్లపై అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్, డిప్యూటీ ఈఈ ఆర్.భీమేశ్వరరావు, మండలంలోని ఏఈలు, ఈఈలు, సిబ్బంది, హార్టికల్చర్, పోలీసు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 4 వినతులు

దెందులూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)లో 4 సమస్యలపై వినతులు అందజేశారని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. ఆధార్ నంబర్ మార్పు, పట్టా మంజూరుతో పాటు మరో రెండు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారన్నారు. చెరువులో సాగు చేస్తున్నప్పటికీ పట్టా ఇవ్వటం కుదరని తెలియజేశామన్నారు. మిగిలిన మూడు సమస్యల పరిష్కారానికి సంబంధిత ఉద్యోగులకు పంపామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: నిడమర్రు ఫీడర్ పనులు నిర్వహిస్తున్నందున 26వ తేదీ మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నారాయణపురం సబ్ స్టేషన్, బాదంపూడి రూరల్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ అంబేడ్కర్ ర్ తెలిపారు. కావున రాచూరు, రావులపర్రు, సీతారాంపురం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

బుట్టాయగూడెం: మండలంలోని అచ్చియ్యపాలెంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ మార్కెట్ డైరెక్టర్‌లు అందరూ పాల్గొనాలని కోరారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి


గణపవరం: గణపవరం మండలంలోని 25 గ్రామాల్లో నిర్వహించే వినాయక చవితి వేడుకలకు ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలని తహసీల్దార్ వైకేవీ అప్పారావు అన్నారు. స్థానిక మండల కార్యాలయంలో ఆయన మహిళా పోలీసులు, వీఆర్‌వోలకు సమావేశం నిర్వహించారు. చవితి వేడుకలు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. డీజే సౌండ్లు, వీవోపీ విగ్రహాలు లేకుండా కాలుష్య నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే పోలీసు శాఖ కూడా చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. సీఐ, ఎస్సైలు నిర్వాహకులను పిలిచి గణేష్ మండపాల ఏర్పాట్లు, నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.

దారిని రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదు

దెందులూరు: దెందులూరు గ్రామంలో 3వ వార్డు లైబ్రరీ సెంటర్ సమీపంలో సర్వే నంబర్ 468–1ఇలో పెంకిటింటికి, 3–158 డోర్ నంబర్‌లో ఉన్న ఇంటికి మధ్యలో ఉన్న వంద గజాల స్థలాన్ని ఎలా రిజిస్ట్రేషన్ చేయిస్తారని శింగర రామచంద్రరాజు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం దెందులూరు మండల సర్వేయర్ రమణారావుపై జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. సమస్య ఉందని మండల సర్వేయర్‌కు ఎన్నో సార్లు చెప్పినా వినకుండా పరిశీలించకుండా 2025 జూన్ 19న సర్వేయర్ కొలతలు వేశారు. తమ ఆస్తి పత్రాలను కూడా సర్వేయర్ పరిశీలించ లేదు. 2025 జూన్ 21న భీమడోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. దీంతో తమ ఇంటికి ఉత్తరం వైపున రాకపోకలను నిలుపుదల చేశారన్నారు. జిల్లా అధికారులు పరిశీలించి తమ సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదుదారులు రాజు కోరారు. ఈ విషయమై గ్రామ సర్వేయర్ రవిని వివరణ కోరగా రెండు ఇళ్ల మధ్య ఉన్న దారిని కొలిచానని దెందులూరు గ్రామ సర్వేయర్ రవి అన్నారు. తాను కొలిచిన తరువాత జరిగిన పరిణామాలకు తనకు సంబంధం లేదని వివరణ ఇచ్చారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల నిరసన



మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిగా హాజరు కాకపోవడంపై ప్రజా ప్రతినిధులు ఎవరికి సమస్యలు విజ్ఞప్తి చేయాలంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలవరం మండల పరిషత్ సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డితో సహా, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి అధికారులు ఎందుకు హాజరు కాలేదంటూ ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబును ప్రశ్నించారు. అందరికీ సమాచారం ఇచ్చామని, రాని వారిపై ఉన్నతాధికారులకు మెమోలు జారీ చేస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కరం కానప్పుడు ఎందుకు సమావేశం అంటూ, సమావేశం నుంచి వాకవుట్ చేస్తామని, సమావేశం నుంచి వెళ్లి పోయేందుకు ప్రయత్నించగా, ఎంపీడీవో హాజరుకాని అధికారుల విషయంపై చర్యలు తీసుకుంటామని, సమస్యలన్నీ కూడా పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పడంతో సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పలువురు అధికారులు వారు చేపట్టే పనులపై సమావేశంలో వివరించారు. కొండ్రుకోట పంచాయతీ పరిధిలోని నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీటీసీ మాడే ఆనంద్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాల్లో వీఆర్‌వోలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న తహసీల్దార్ ఆర్ఎస్‌రాజు మాట్లాడుతూ తప్పనిసరిగా వీఆర్‌వోలు సచివాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని, రైతులందరికీ అందేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. గతంలో కొండ వాగుల ఉధృతికి గండ్లు పడిన కాలువ గట్లు మరమ్మతులకు రూ.46 లక్షలతో ప్రతిపాదనలు పంపామని మైనర్ ఇరిగేషన్ డీఈ వరప్రసాద్ తెలిపారు. అయితే కడెమ్మ కాలువ పూడికతీతకు రూ.5 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని, మిగిలిన నిధులు మంజూరైన తరువాత పనులు చేపడతామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.